క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: దూలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, ఫీడర్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కేకే సొసైటీ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఏరియా, హనుమాన్ వేబ్రిడ్జి రోడ్డు, చౌదరి వేబ్రిడ్జి, ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో హరియానా వేబ్రిడ్జి, మజీద్ గల్లీ, డెక్కన్ కాంటా లేన్, ఇండస్ట్రీయల్ ఏరియా, ఐడీఏ-1 ఫీడర్ పరిధిలో అయ్యప్పస్వామి టెంపుల్, ఇండస్ట్రీ ఏరియా, ఐడీఏ-2 ఫీడర్ పరిధిలో మొత్తం ఇండస్ట్రీయల్ ఏరియా, 11కేవీ కార్తీకవనం ఫీడర్ పరిధిలోని 120 గజాలు వీకర్ సెక్షన్, 60 గజాలు, అయ్యప్ప కాలనీ, గంగస్థాన్, కార్తీకవనం, ఫారెస్ట్ అకాడమీ, ఐజాంట్ కంపెనీ, దూలపల్లి ఫీడర్ పరిధిలో దూలపల్లి గ్రామం, అశోక ఏలా మైసస్ ఫేజ్-1, సెయింట్ మార్టిన్స్ రోడ్డు, స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఏరియా, 11 కేవీ గంగస్థాన్ ఫీడర్ పరిధిలో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

నిజాంపేట్: డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ మార్త వాణిప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రగతినగర్ లేక్‌వ్యూ కాలనీలోని మూడో లేన్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వాణిప్రసాద్ మాట్లాడుతూ గతంలో బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు., సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనదారుల కష్టాలు తీరుతాయన్నారు. కార్పొరేటర్ వెంట లేక్‌వ్యూ కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

శభాష్ పోలీస్



మహిళను తీసుకెళ్తున్న సీఐ ప్రశాంత్, ఎస్‌ఐ శరత్ తదితరులు

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతరలో భాగంగా ఉదయం భక్తులు పోటెత్తడంతో ఓ మహిళా భక్తురాలు సొమ్మసిల్లి పడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్, ఎస్‌ఐ శరత్ కుమార్ ఆమెను చేతులపై ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశాల వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు క్షణాల్లో చాకచక్యంగా వ్యవహరించడంతో అక్కడున్న భక్తులు ప్రశంసించారు.

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం పెంచాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 31 లోగా వంద శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని, రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారి శ్రీహరి రాజు, మేనేజర్ సునంద, బిల్ కలెక్టర్లు ఉన్నారు.

క్రైం కార్నర్..

వ్యక్తి అనుమానాస్పద మృతి

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది, ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన బి.కుమార్(55) పెయింటర్‌గా పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండటంతో భార్యా పిల్లలు అతడిని వదిలి వెళ్లిపోయారు. దీంతో గత ఐదేళ్లగా ఒంటరిగా ఉంటున్న కుమార్ అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం అతను ఉంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు బద్దలు కొట్టి చూడగా అతను మృతి చెంది ఉన్నాడు. శవం పూర్తిగా కుళ్లిపోవడంతో రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా చిత్తారమ్మ జాతర



చిత్తారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద్..



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- అలరించిన పోతరాజుల నృత్యాలు, శివసత్తుల విన్యాసాలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- నగరంలో పల్లెటూరి శోభ

సుభాష్‌నగర్: గాజులరామారంలోని శ్రీ చిత్తారమ్మ దేవి జాతర ఆదివారం కన్నుల పండువగా జరిగింది. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 3 గంటలకు అభిషేకం, 4 గంటలకు విజయ దర్శనం, ఒడి బియ్యం సమర్పణ, 11 గంటలకు బోనాలు, సాయంత్రం పోతరాజులతో ఊరేగింపు, రాత్రి వినోద సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పోతరాజుల నృత్యాలు, శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గాజులరామారం ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది.



మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులు..

పల్లెటూరి వాతావరణం..

వివిధ జిల్లాల నుంచి జాతరకు వచ్చిన భక్తులు ఆలయానికి చుట్టూ అర కిలోమీటర్ వరకు డేరాలు వేసుకుని కుటుంబ సమేతంగా బోనాలు తీసి అనంతరం వంటలు చేసుకుని సహసంక్తి భోజనాలు చేయడంతో స్థానికంగా పల్లెటూరు వాతావరణం ఉట్టి పడింది.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఏసీపీలు గంగారం, గోవర్దన్, కార్పొరేటర్ ఇతర ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ కున అంతయ్య గౌడ్ సన్మానించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు..

బాలానగర్ డివిజన్ పరిధిలోని ఐదు పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బందితో జాతరలో ఎలాంటి ఆవంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ అర కిలో మీటర మేర ప్రాంతాన్ని పోలీసులు పహారా కాసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.





బోనాలతో మహిళల ఊరేగింపు..

ట్రాఫిక్ మళ్లింపు...

జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా షాపూర్ నగర్, గాజులరామారం ప్రధాన రోడ్డులోని వాహనాలను జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దారి మళ్లించారు. షాపూర్‌నగర్ నుండి కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలను డీసీపీ కార్యాలయం పక్కగా హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డు మీదుగా జగద్గిరిగుట్ట వైపు, అదే విధంగా ఉషోదయ కాలనీ నుంచి వచ్చే వాహనాలను శ్రీనివాస్‌నగర్ మీదుగా జగద్గిరిగుట్ట ఆపై కూకట్‌పల్లికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.



పూనకంతో శివసత్తులు..









శివసత్తుల విన్యాసాలు..



బోనాలతో ఊరేగింపు..



ఆలయ చైర్మన్ కూన అంతయ్యగౌడ్‌ను సత్కరించిన ఏసీపీలు గంగారామ్, గోవర్ధన్

బధిరులకు వైద్య పరీక్షలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ చెరుకుపల్లి కాలనీలో ఆదివారం ఆశ్రయ ఆకృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వినికిడి సమస్యలతో బాధ పడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. కాలనీలోని రామాలయం ఎదురుగా ఉన్న స్థలంలో శిబిరం ఏర్పాటు చేయగా 93 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 25 మందికి వినికిడి సమస్య ఉన్నట్లు గుర్తించారు. కాలనీ ప్రెసిడెంట్ కిషోర్‌చారి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ఆడియోలాజిస్ట్ భార్గవరావు, కో.ఆర్డినేటర్ హరికృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.



వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు శాపం



పద్మానగర్ ఫేజ్-1లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

జగద్గిరిగుట్ట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వాహనదారుల పాలిట ప్రాణసంకటంగా మారుతోంది.. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్-01లోని ప్రధాన రోడ్డుపై ఉన్న ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది.. దాదాపు రోడ్డు మధ్యకు వచ్చిన స్తంభంతో వేగంగా వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో పలువురు ద్విచక్ర వాహనదారులు ఈ స్తంభాన్ని ఢీకొని ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించిన స్తంభాన్ని మార్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు



ప్రమాదానికి కారణమైన లారీ

దుండిగల్: బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో అదుపు తప్పిన లారీ ఓ పాదచారుడి మీదుగా దూసువెళ్లడంతో అతని రెండు కాళ్లు కోల్పోయిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి చౌరస్తాలో సాయినాథ్ సొసైటీ నుంచి దూలపల్లికి వెళ్లేందుకు ఆదివారం మధ్యాహ్నం ఓ యువకుడు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గండిమైసమ్మ నుండి సూరరాం వైపు వేగంగా వచ్చిన లారీ బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టి రోడ్డు దాటుతున్న యువకుడి మీదుగా వెళ్లింది. ఈ ఘటనలో అతను రెండు కాళ్లు కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు ఇతర రాష్ట్రానికి చెందిన వాడై ఉంటాడని, అతని ఆచూకీ తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్యామ్‌కుమార్

సుభాష్‌నగర్: మల్లారెడ్డి యూనివర్సిటీలో ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నిజామాబాద్ జిల్లా జలాల్‌పూర్‌కు చెందిన కె.శ్యామ్‌కుమార్ ఉస్మానియా యూనివర్శిటీ పీహెచ్‌డీ పట్టా పొందారు.. ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.విశ్వనాథ్ పర్యవేక్షణలో శ్యామ్‌కుమార్ ప్రభుత్వ రంగ సంస్థల్లో మానవ వనరుల నిర్వహణ, గణాంక పద్దతుల అంశంపై పరిశోధనలు సమర్పించగా జనవరి 2023లో డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్శిటీ నుండి పీహెచ్‌డీ పట్టా అందుకోనున్న శ్యామ్‌కుమార్‌ను మల్లారెడ్డి యూనివర్శిటీ అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ఎన్టీఆర్‌నగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో ఆదివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నగర్ పార్కులో ఓపెన్ జిమ్, క్రీడా ప్రాంగణం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. స్థానిక సమస్యలు తెలుసుకున్న డిప్యూటీ మేయర్, బస్తీ దవాఖానా, శ్రీనివాస్‌నగర్ పార్కు ప్రహరీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్ ముదిరాజ్, సాంబశివ రెడ్డి, మంజునాథ్, ఎన్టీఆర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ, కాలనీ వాసులు వగడాల శ్రీనివాస్‌రెడ్డి, మధు, రాజేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ ఎన్‌ఎల్‌బీ నగర్‌కు చెందిన బీజేపీ యూత్ నాయకుడు గిరిధర్‌గౌడ్ ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గిరిధర్‌గౌడ్‌ను ఎన్‌ఎల్‌బీనగర్ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే స్థానికంగా బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్‌యాదవ్, డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, నాయకులు బస్వరాజు, వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్ గుప్త, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

నిజాంపేట్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ చిట్ల దివాకర్‌లతో కలిసి 2వ డివిజన్ పరిధి అపురూప కాలనీ-2లోని పంచతత్వ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లేస్పేస్, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, కార్పొరేషన్ పరిధిలోని మిగతా ప్రాంతాల్లో సైతం పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ రాజేశ్వరి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాములు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సాంబశివరెడ్డి, మహేందర్‌రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దశరథ్, చందు, దివాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పంచతత్వ పార్కు పనులను పరిశీలిస్తున్న మేయర్ నీలారెడ్డి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్‌ఐటీ) కళాశాలలో కేమ్ క్లబ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన 600 మంది పూర్వ విద్యార్థులు కళాశాలతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2005లో 1360 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఎంఎల్‌ఆర్‌ఐటీలో నేడు 4500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి ప్లేస్‌మెంట్ లభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. కె.శ్రీనివాస్ రావు, కేమ్ క్లబ్ ఫ్యాకల్టీ కో.ఆర్డినేటర్ సందీప్, నిర్మిత్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌ఆర్‌ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

రంగారెడ్డినగర్: ప్రధాన రహదారుల వెంబడి అక్రమ పార్కింగ్‌లు, ఆటో అడ్డాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఐడీపీఎల్ చౌరస్తా జంక్షన్ పనులు ఓ వైపు కొనసాగుతుండగా మరో వైపు రోడ్డుపైనే ఆటోలను నిలుపుతున్నారు. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా ఓ వైపు ఫుట్‌పాత్ నిర్మాణ పనులు జరుగుతుండగా మరో వైపు చౌరస్తాను ఆనుకుని టర్నింగ్ నుండి ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు వాహనాలను నిలుపుతున్నారు. దీంతో రోడ్డు కుచించుకుపోయి బస్సులు, ఇతర భారీ వాహనాల రాక పోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. దీనికి తోడు ఇతర వాహనదారులు సైతం గంటల తరబడి పార్క్ చేస్తున్నారు. సమీపంలోనే ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా వీటిపై దృష్టి సారించకపోవడం గమనార్హం.



ఐడీపీఎల్ చౌరస్తాలో రోడ్డుపై నిలిపిన ఆటోలు, ఇతర వాహనాలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

సుభాష్‌నగర్: క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చార్మినార్ సర్కిల్ ఫారెస్ట్ ఆఫీసర్ బి. సైదులు అన్నారు. రెండు రోజుల పాటు జరిగే అటవీ శాఖ ప్రాంతీయ స్థాయి క్రీడలు ఆదివారం దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో ప్రారంభమయ్యాయి. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్. జావెలిన్ త్రో, క్రికెట్, పుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, రైఫిల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. చార్మినార్ అటవీ సర్కిల్ పరిధిలోని మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు, పరిశోధక సంస్థల అధికారులు, ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రధాన అటవీ ముఖ్య సంరక్షణాధికారి ఎల్యుసింగ్ మేరు పోటీలను తిలకించారు. కార్యక్రమంలో అకాడమీ అదనపు డైరెక్టర్ ఎస్. రమేష్, జిల్లా అధికారులు రాహుల్ కిషన్ జాదవ్, జానకీరామ్, డి.వి.రెడ్డి, శ్రీధర్ రావు, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

భట్రాజు సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గం

సుభాష్‌నగర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భట్రాజు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సూరారంలోని ఉమా మహేశ్వర ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల అధికారిగా ప్రతికంఠం భార్గవరాజు, పరిశీలకులుగా మదన్‌మోహన్ రాజు వ్యవహరించారు. అధ్యక్షుడిగా కుర్రపాటి కరుణాకర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా లోలబట్టు కృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా సుగుణాకర్ రాజు, నరేందర్ రాజు, చక్రహరి శ్రీనివాస్ రాజు, తంగెళ్ల సుజాత, కోశాధికారిగా ఏనుగుదాటి శివాజీరాజు, కార్యదర్శులుగా నర్సింహరాజు, నీలకంఠ లత, ప్రచార కార్యదర్శిగా సరస్వతి నరేందర్ రాజు, సభ్యులుగా సత్యవాణి, మురళికృష్ణ, లక్ష్మణ్, జనార్దన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్ రాజు, కృష్ణంరాజు మాట్లాడుతూ భట్రాజు కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధిని చూసి పట్టం కట్టాలి : ఎమ్మెల్యే కృష్ణారావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ డివిజన్‌లో రూ.1.25 లక్షల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. మహాత్మాగాంధీ పార్కు అభివృద్ధి పనులు, బుద్ధ వర్టెక్స్ వద్ద సీసీ రోడ్డు పునరుద్ధరణ, శిల్పా ఎవెన్యూ నందనవనం పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేపీహెచ్‌బీ డివిజన్‌లోని పార్కులు అభివృద్ధి కోసం ఇప్పటికే అనేక నిధులు కేటాయించామన్నారు. అన్ని ప్రాంతాల్లో పార్కులు, ఇండోర్ స్టేడియాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామని ప్రజలు జరుగుతున్న అభివృద్ధిని గుర్తించి మరోసారి పట్టం కట్టాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని, అన్ని ప్రాంతాల వారు ఇక్కడ నివసించడం ఆనందంగా ఉందన్నారు. ఎవరికైనా మౌలిక సదుపాయాల కల్పనల విషయంలో సమస్యలు ఎదురైతే నేరుగా తన కార్యాలయంలో సందర్శించవచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, నాయకులు సాయిబాబా చౌదరి, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, శ్యామలరాజు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.